

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.0

ANDHRAJYOTHY

సూర్యాపేట

5

గురువారం 24 జూలై 2025

అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఐల చేయూత

మునగాల రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామ అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణానికి భూమి కొనుగోలుకు ఎన్‌ఆర్‌ఐలు చేయూత అందించారు. ఎమ్మెల్యే పద్మావతి పిలుపుమేరకు అమెరికాలో నివసిస్తున్న ఏనుగుల వెంకటేశ్వరరావు, జెట్టి ప్రశాంత్‌రెడ్డి, గడ్డం మధుకర్‌రెడ్డి, ముది రెడ్డి మధుకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెలిగేటి కరుణాకర్, గుండు చంద్రకిరణ్, గొళ్ళమూడి శ్రీనివాసరావు, రోహిత్‌రెడ్డి కలిసి రూ.6లక్షలతో 160 గజాలస్థలాన్ని కొనుగోలు చేసి బుధవారం ఆ పత్రాలను సీడీపీవో పారిజాతంకు అందజేశారు.

చికెన్ ధరలు | లైవ్ : రూ.146 | డ్రెస్ : రూ.221 | స్కిన్‌లెస్ : రూ.250

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



నేరేడుచర్ల ఎరువుల దుకుణాన్ని తనిఖీచేస్తున్న ఏడీఏ రవి, వ్యవసాయాధికారి జావిద్

నేరేడుచర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : అధిక ధరలకు ఎరువులు, యూరియాను విక్రయిస్తే డీలర్ లైసెన్స్‌లు రద్దు చేస్తామని హుజూర్‌నగర్ వ్యవసాయ సంచాలకుడు రవి హెచ్చరించారు. బుధవారం నేరేడుచర్ల పట్టణంలోని పద్మ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. యూరియా స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల డీలర్ల నిబంధనలకు లోబడి వ్యాపారం చేసుకోవాలన్నారు. ఎవరైనా వాటిని అధిగమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. అవసరాన్ని బట్టి యూరియా వాడుకోవాలని, స్టాక్ పెట్టుకోవాల్సిన అవసరం లేనందున రైతులు ఎప్పుడు కావాలంటే అప్పుడే యూరియా తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయాధికారి జావిద్, దుకాణదారులున్నారు.

సాగునీటి కోసం ఎదురుచూపులు

శ్రీరాంసాగర్ రెండో దశ(ఎస్సారెస్పీ) ఆయకట్టు కింద ఉన్నరైతులు గోదావరి జలాల కోసం ఎదురుచూస్తున్నారు. పదేళ్ల నుంచి ఈ నెల చివరి నుంచి ఆగస్టు మొదటి వారంలోనే గోదావరి జలాలను విడుదల చేసేవారు. ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి నేటికీ నీటి విడుదల చేయలేదు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు గోదావరి జలాల కోసం గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్నారు. సుమారు లక్ష ఎకరాలను దుక్కులు దున్ని, నార్లు సిద్ధం చేసుకుని సాగుకు సిద్ధం చేశారు.

- (ఆంధ్రజ్యోతి-అర్వపల్లి)



అడివెంల గ్రామంలోని శ్రీరాంసాగర్ కాల్వ

సేద్యానికి సిద్ధంగా ఉన్న భూములు

- లక్ష ఎకరాల్లో దుక్కులు సిద్ధం
- శ్రీరాంసాగర్‌లో కనిపించని నీరు
- ఎగువన వర్షాలు కురిస్తేనే అవకాశం

ఎస్సారెస్పీ కాల్వలను 2.44 లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించే లక్ష్యంతో రూపకల్పన చేశారు. జనగాం జిల్లా కొడకండ్ల వద్ద ఉన్న బయ్యన్నవాగు నుంచి శ్రీరాంసాగర్ రెండో దశ కాల్వలకు నీటిని విడుదల చేస్తారు. ఈ నీళ్ల జిల్లాలోని తిరుమలగిరి మండలం వెలిశాల సమీపంలో 69, 70, 71 డీబీఎం మెయిన్ కాల్వలకు నీరు ప్రవహిస్తుంటుంది. దీంతో సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని 14 మండలాల 203 గ్రామాలకు 320 చెరువులు, కుంటలకు ప్రతి యేటా యాసంగి, వానాకాలం సీజన్లకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపుతారు. ఇప్పటివరకు బోరు, బావులతో నారుమడులను దున్ని నారు పోసుకుని దుక్కలను సిద్ధం చేసుకున్నారు. సుమారు లక్ష ఎకరాలను రైతులు సేద్యానికి సిద్ధం చేశారు. నీటిని విడుదల చేస్తే నాట్లు వేసేందుకు రైతులు ఎదురుచూస్తున్నారు.

శ్రీరాంసాగర్‌లో నీటి కరువు..

శ్రీరాంసాగర్ ఎగువన వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులో 90 టీఎంసీలకు గానూ 20 టీఎంసీల నీరు మాత్రమే ఉందని అధికారులు చెబుతున్నారు. 60 టీఎంసీలు దాటితేగాని దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం లేదంటున్నారు. ఇంకా 40 టీసీఎంల నీరు చేరడానికి వరుసగా వర్షాలు కురిస్తే సుమారు వారం రోజులు పట్టవచ్చంటున్నారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యాంలో 24 టీఎంసీలకు గానూ ఆరు టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ఎల్ఎండీ నిండటానికి కూడా వారం రోజులు పట్టే అవకాశం ఉందంటున్నారు. ఎగువ నుంచి నీరు వస్తే విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ప్రాజెక్ట్ నిండితే నీటి విడుదలకు అవకాశం

శ్రీరాంసాగర్ నిండితే నీరు విడుదల చేసే అవకాశం ఉంది. ప్రణాళికబద్ధంగా నీటిని విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాం. శ్రీరాంసాగర్ ఎగువన వర్షాలు కురిస్తే వెంటనే నీటిని విడుదల చేస్తాం. చెరువులు, కుంటలు నింపుతాం.

- సత్యనారాయణ, ఎస్సారెస్పీ ఈఈ

గోదావరి జలాల కోసం ఎదురుచూస్తున్నాం



గోదావరి జలాల విడుదల కోసం ఎదురుచూస్తున్నాం. నీటికోసం భూమిని దున్ని సిద్ధంగా ఉంచాం. నీటిని విడుదల చేస్తే పొలాలు సేద్యం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకు న్నాం. కనీసం చెరువులు, కుంటలు నింపాలి.

- పోలేబోయిన కిరణ్‌కుమార్, జాజిరెడ్డిగూడెం గ్రామం

పేదలందరికీ రేషన్‌కార్డులు

మంత్రి ఉత్తమ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేస్తుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో హుజూర్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ఏర్పాటుచేసిన 'ఉత్తమ్ సైన్యం' పోస్టర్, సోషల్ మీడియా లోగోను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడికి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అందాలన్నారు. పేదలకు ఇచ్చిన హామీలను వందశాతం అమలుచేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, రైతుల పక్షపాతి అని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి అజీజ్‌పాషా,ఈడ్పుగంటి మోహన్, సమ్మెట సుబ్బరాజు, గంజి శివ, గోవిందరావు, చంద్రశేఖర్, నజీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు రాజ్యాంగంలో
ఎన్నో చట్టాలు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణచౌహాన్

హుజూర్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బాలికల సంరక్షణకు రాజ్యాంగంలో అనేక చట్టాలు ఉన్నాయని హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణచౌహాన్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అయేషాసరీనా అన్నారు. బుధవారం పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ విద్యార్థినులు మనోధైర్యంతో ఉండాలన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధపడాలన్నారు. బాలికలకు ప్రభుత్వాలు అండగా ఉంటాయన్నారు. రాజ్యాంగంలోని చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు, విద్యార్థినులకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. చదువుకునే దశలోనే విద్యార్థులు భవిష్యత్ నిర్ణయించుకోవాలన్నారు. అనుచితంగా ఎవరైనా ప్రవర్తిస్తే తల్లిదండ్రులు, గురువులకు వెంటనే చెప్పాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి మారుతీప్రసాద్, కాలువ శ్రీనివాసరావు, బాణోత్ సురేష్‌కుమార్, గోపాలకృష్ణ, రెహనాబేగం, సైదాహుస్సేన్, యాదగిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇలా అయితే..

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమంటారు. నేరాల నివారణకు, నేరాలు జరిగినపుడు ఛేదించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అయినా సూర్యాపేటలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు మాత్రం పనిచేయడం లేదు. కాలనీలు, శివారు ప్రాంతాలు, దుకాణాల సముదాయాలు, విద్యాసంస్థల ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని పదే పదే విజ్ఞప్తి చేసే పోలీసులు ఉన్న కెమెరాలు పనిచేయకున్నా పట్టించుకోవడం లేదు. సీసీ కెమెరాలు పని చేసి ఉంటే కొన్ని కేసులను పోలీసులు సులువుగా ఛేదించేవారంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట క్రైం)

నిఘా ఎలా?

- నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో కీలకం
- అయినా పట్టించుకోని పోలీసులు
- ఇటీవల సూర్యాపేటలో నగల దుకాణంలో భారీ చోరీ
- చర్చనీయాంశమైన సీసీ కెమెరాల నిర్వహణ

తెలుగు రాష్ట్రాల రాజధానులైన హైదరాబాద్, అమరావతి నగరాలను కలిపే జాతీయ రహదారిపై సూర్యాపేట ఉంది. అంతేకాకుండా ఖమ్మం, వరంగల్, జనగాం, మిర్యాలగూడ పట్టణాలకు ఈ పట్టణమే కూడలి. నిత్యం వివిధ పనుల నిమిత్తం వేల సంఖ్యలో సూర్యాపేటకు వచ్చి వెళ్తుంటారు. అంతేకాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు సూర్యాపేట మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. వ్యాపారపరంగా కూడా సూర్యాపేట దినదినాభివృద్ధి చెందుతోంది. ఈ క్రమంలో పట్టణంలోని పలుప్రాంతాల్లో కొన్నేళ్ల కిందట సుమారు 140 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఆయా కెమెరాల నిర్వహణను సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి పర్యవేక్షిస్తారు. అయితే కొంతకాలంగా సీసీ కెమెరాలు చాలా వరకు పనిచేయడం లేదు. సూర్యాపేట శివారు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రమాదాలకు కారణమైన వాహనాలను గుర్తించడం కూడా ఇబ్బందిగా మారింది.

కెమెరాలు పనిచేసి ఉంటే...

సూర్యాపేటలోని సీసీ కెమెరాలు పలుచోట్ల పనిచేయకపోవడంతో ఇటీవల జరిగిన పలునేరాలను పరిష్కరించలేకపోతున్నారు. మూడేళ్ల కిందట సూర్యాపేటకు చెందిన ధరావత్ నిఖిల్‌నాయక్ మృతదేహం మునగాల వద్ద గల నాగార్జునసాగర్ ఎడమకాల్వలో లభించింది. అయితే ఈ కేసులో నిఖిల్‌నాయక్ పట్టణంలోని జనగాం క్రాస్‌రోడ్డు సమీపంలోని ఓ ఇంట్లో మిత్రులతో కలిసి పార్టీ చేసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి జాతీయరహదారి వద్దకు వచ్చినట్లు స్థానిక కాలనీలో ఏర్పాటుచేసిన కెమెరాలో రికార్డు అయ్యింది. కానీ జనగాం క్రాస్ రోడ్డు నుంచిమునగాల సాగర్ కాల్వ వద్దకు ఎలా వెళ్లాడు, ఎవరు తీసుకెళ్లారు అనే విషయాలు నేటికీ తెలియలేదు. జనగాం క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పని చేసి ఉంటే అక్కడి నుంచి నిఖిల్‌నాయక్ ఎలా వెళ్లాడు అనే విషయాలు తెలిసేది. దీంతో నిఖిల్‌నాయక్ మృతి విషయంలో పోలీసులు ఖచ్చితమైన విషయాలను వెల్లడించలేకపోయారు.

సూర్యాపేటలోని ఎంజీరోడ్‌లోని శ్రీసాయిసంతోషి నగల దుకాణంలో ఈ నెల 20 రాత్రి చోరీకి పాల్పడినట్లు అనుమానిస్తున్న వ్యక్తులు నగల దుకాణం సమీపంలోని వీధుల్లో ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న కెమెరాల్లో నమోదయ్యారు. అక్కడ నుంచి..

- మిగతా 8వ పేజీలో..

క్షేత్రస్థాయిలో నిఘా ఏర్పాటు చేయాలి



విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌కు రివార్డు అందజేస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేట క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు నేరాల నివారణకు సమష్టిగా పనిచేయాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నా రు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీసుల నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలు డయల్-100కు ఫోన్ చేసి పోలీస్ సేవలు పొందాలన్నారు. నిత్యం వాహనాలను తనిఖీలు చేయాలని, అనుమానిత వ్యక్తుల కదలికలు గమనిస్తూ రౌడీషీటర్లపై నిఘా ఉంచాలన్నారు. దొంగతనాల కేసుల్లో కేసులను ఛేదించడంతో పాటు చోరీకి గురైన సొత్తును రికవరీ చేసేలా పనిచేయాలన్నారు. కాలనీలు, దుకాణాల సముదాయాల ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకోసం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ మోసాలు, మహిళా భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఇటీవల జిల్లాలో గంజాయి, నకిలీ విత్తనాల పట్టివేత కేసుల్లో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ బాగా పని చేశారని, ఐజీ కార్యాలయం నుంచి వచ్చిన మెరిటోరియస్ సర్వీస్ రివార్డును అందజేసినట్లు తెలిపారు. ఉత్తమంగా విధులు నిర్వహించే పోలీసులకు అందించే రివార్డుల్లో అత్యుత్తమమైనది మెరిటోరియస్ సర్వీస్ రివార్డు అన్నారు. సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ హరిబాబు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సీఐలు శివశంకర్, చరమందరాజు, రజితారెడ్డి, రంజిత్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, నర్సింహారావు, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుపై నాట్లువేసి నిరసన



నెమ్మికల్ సంత వద్ద రోడ్డుపై ఉన్న గుంత వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఆత్మకూర్(ఎస్), జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమ్మికల్ గ్రామం నుంచి కందగట్ల గ్రామానికి వెళ్లే మార్గంలో పశువుల సంత వద్ద కేబుల్ లైన్ మరమ్మతు కోసం నాలుగు రోజుల క్రితం తవ్విన గుంత పూడ్చకపోవడంతో కందగట్ల గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. పనులు పూర్తి చేయకపోవడంతో గ్రామస్థులు బుధవారం రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో కందగట్లకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బారీ అశోక్‌కుమార్, జలేందర్, బోనగిరి సతీష్, తిరుగుడు యాదగిరి, నవీన్, ప్రవీణ్, ఉదయ్, సందీప్, సంతోష పాల్గొన్నారు.

భూ భారతి అర్జీలు పరిష్కరించాలి : కలెక్టర్



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

చివ్వెంల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భూభారతి అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం మండలకేంద్రంలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని, తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు గణితం బోధించారు. వారిని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో సంతోష్ కుమార్, లింగయ్య, కవిత పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

సూర్యాపేట(కలెక్టరేట్): జిల్లాలో ఈ నెల 27న లైసెన్స్ సర్వేయర్లు, జీపీవోల పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో లైసెన్స్ సర్వేయర్ల పరీక్ష ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు థియరీ పరీక్ష, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్లాటింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోగులతో మర్యాదగా ప్రవర్తించాలి

భానుపురి : ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని, అత్యవసర విభాగంలో సిబ్బంది అందుబాటులో ఉండాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవర్ తెలిపారు. సూర్యాపేట ప్రభుత్వఆసుపత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. వివిధ విభాగాలకు సంబంధించిన గదులను పరిశీలించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత పాటించాలన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ శ్రీకాంత్, వైద్యులు ఉన్నారు.

ఉపరాష్ట్రపతి రాజీనామాపై
బీజేపీ వివరణ ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

సూర్యాపేటటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాపై బీజేపీ వివరణ ఇవ్వాలని, బీసీ రిజర్వేషన్లపై కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో మాట్లాడారు 42శాతం బీసీ రిజర్వేషన్ అమలు చట్టబద్ధత కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ఒత్తిడి చేయాలన్నారు. ఉప రాష్ట్రపతి రాజీనామాపై ప్రధాని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరుగుతుంటే కాంగ్రెస్ మంత్రుల ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తోందన్నారు. వ్యక్తిగత విషయాలపై ఎవరు నిఘా పెట్టినా తప్పే అని అన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్కైలాబ్, కోటగోపి తదితరులు పాల్గొన్నారు.


జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్



జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తుగానే మూసివేయగా, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను విద్యార్థి సంఘాల నాయకులు బంద్ చేయించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

- వివరాలు 8లో

పెండింగ్ సీఎంఆర్ పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట(కలెక్టరేట్),జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2023-24 యాసంగి సీజన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సీ ఎంఆర్‌ను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు ఆదేశించారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు, సివిల్ సప్లయ్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశం లో మాట్లాడారు. ఈ నెల 27 నాటికి పెండింగ్ సీఎంఆర్ పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించారు. సివిల్ సప్లయ్ అధికారులు రైస్ మిల్లుల్లో తనిఖీలు చేపట్టాలని సూచించా రు. సమావేశంలో డీఎస్‌వో మోహన్‌బాబు, ఏఎస్‌వో శ్రీనివాసరెడ్డి, ఏడీఎం బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

భూభారతి అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

కోదాడటౌన్: భూభారతి అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో సూర్యనారాయణతో కలిసి బుధవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సులో 904 దరఖాస్తులు వచ్చాయని, అందులో 196 సాదాబైనామా దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. 588 మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. 16మంది రైతుల భూ సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ఖమ్మంలో రోడ్డులో ఉన్న షిర్డి సాయినగర్ బ్రిడ్జిని అధికారులతో కలిసి పరిశీలించి మునిసిపల్ కమిషనర్‌కు సూచనలు చేశారు. 8వ వార్డులో అదనపు కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాజీద్ అలీ, మునిసిపల్ కమిషనర్ రమాదేవి, ఆర్ఐ రాజేష్, భవాని, రాజయ్య పాల్గొన్నారు.

బంగారం చోరీ కేసులో
ముమ్మర దర్యాప్తు

నేపాల్, జార్ఖండ్ వాసులుగా అనుమానిస్తున్న పోలీసులు

సూర్యాపేట క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులోని శ్రీసాయిసంతోషి నగల దుకాణంలో జరిగిన చోరీ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. దుకాణంతో పాటు అనుమానితులు నివసించిన నివాసం వద్ద సేకరించిన ఆధారాల మేరకు చోరీకి పాల్పడిన వారు నేపాల్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులుగా గురించినట్లు సమాచారం. చోరీకి పాల్పడిన వ్యక్తుల్లో ఇద్దరిపై గతంలో చోరీలకు సంబంధించి వివిధ రాష్ట్రాల్లో కేసులు నమోదై ఉన్నట్లు తెలుస్తోంది. సూర్యాపేట పోలీసులు సంఘటనా స్థలంలో సేకరించిన ఫింగర్ ప్రింట్ల ఆధారంగా చోరీకి పాల్పడిన ప్రధానవ్యక్తిని గుర్తించారు. అయితే అనుమానితులను పట్టుకునేందుకు సూర్యాపేట నుంచి మూడు పోలీస్ బృందాలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లాయి. ఢిల్లీ, నేపాల్ సరిహద్దు, జార్ఖండ్ ప్రాంతాలకు ఈ బృందాలు వెళ్లి నేరస్థులను పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. చోరీ చేసిన అనంతరం నేరస్తులు విజయవాడ వైపు వెళ్లి అక్కడి నుంచి రైలులో వారి ప్రాంతాలకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తులను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. అనుమానితులు సూర్యాపేటలో ఉండటానికి ముందు ఖమ్మం జిల్లా కేంద్రంలో కొన్నినెలల పాటు నివసించి అక్కడ రాత్రి సమయంలో గుర్ఖాలుగా పనిచేసినట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి సూర్యాపేటకు రెండు నెలల క్రితం వచ్చి గదిని అద్దెకు తీసుకుని నగలదుకాణంలో చోరీ చేసేందుకు రెక్కీ నిర్వహించిన చోరీకి పాల్పడ్డారు.

పోలీసుల అదుపులో అనుమానితులు?

నగల దుకాణంలో చోరీకి పాల్పడిన వ్యక్తులకు సంబంధించిన పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఖమ్మంలో ప్రైవేట్‌గా పనిచేసే వారిని అదుపులోకి తీసుకుని చోరీకి పాల్పడిన వారి గురించి వివరాలు రాబడుతున్నట్లు తెలుస్తోంది. సెల్‌ఫోన్ కాల్‌డేటా ఆధారంగా ఖమ్మంలో ఉంటున్న నేపాల్ ప్రాంతానికి చెందిన వ్యక్తికి చోరీకి పాల్పడిన వ్యక్తి ఫోన్‌కాల్స్ వెళ్లినట్లు గుర్తించారు. ఆ దిశగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఏదిఏమైనా నగల దుకాణంలో చోరీ కేసును పోలీసులు త్వరలో ఛేదించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

సంస్థాగత ఎన్నికలకు అధికారుల కసరత్తు

మర్రిగూడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సంస్థాగత ఎన్నికలకు నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. మండలంలో 18 సర్పంచుల స్థానాలకు 170 వార్డులు, 30,847 ఓటర్లు ఉన్నారు. అయితే ఈసారి సరంపేటను నూతన ఎంపీటీసీ స్థానంగా ప్రకటించడంతో ఆ సంఖ్య 10కి చేరింది. ఒక జడ్పీటీసీ స్థానం ఉన్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై స్పష్టత రాగానే సామాజికవర్గాల వారీగా రిజర్వేషన్ల ఖరారుకు ప్రభుత్వం సమయాత్తమవుతోంది. ఎన్నికల సంఘం ఆదేశానుసారం జిల్లా పరిషత్ ప్రాదేశిక స్థానాల నిర్ధారణ ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు అన్నిఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతోపాటు గ్రామపంచాయతీలో వార్డుల వారీగా ఓటర్ల ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు మండల స్థాయి యంత్రాంగం సమయాత్తమవుతోంది. ఇప్పటివరకు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సామాజిక వర్గాల నిష్పత్తి ఆధారంగా మండల యూనిట్‌గా తీసుకొని ఎంపీటీసీల స్థానాలు, సర్పంచి పదవుల రిజర్వేషన్లు ఖరారు చేసి వార్డు సభ్యుల రిజర్వేషన్లను నిర్ధారించి సిద్ధంగా ఉంచుకున్నట్లు సమాచారం. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండల యూనిట్‌గా ఎంపీటీసీల స్థానాలు, సర్పంచుల రిజర్వేషన్ ఖరారు చేసి నిర్ణయించాలని జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. ముందస్తుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఆ తర్వాత పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. దీని కనుగుణంగా మండల, జిల్లా పరిషత్ నిర్వహణకు అవసరమైన కసరత్తు పూర్తి చేసే పనిని యుద్ధ ప్రాతిపదికన చేపట్టే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. బీసీ రిజర్వేషన్లకు ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలిపితే ఈ సారి నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ సామాజిక వర్గాలకు మండలంలో ప్రాతినిథ్యం భారీగా పెరగనున్నది. గత ఏడాది 2018లో మండల సంస్థల జిల్లా ప్రాదేశిక జరిగిన ఎన్నికల్లో 11ఎంపీటీల స్థానాలు ఉన్నాయి. అందులో ఆరు బీసీలకు, రెండు స్థానాలు ఎస్సీలకు, ఒకటి ఎస్టీలకు, రెండు ఓసీలకు కేటాయించారు. అయితే ప్రభుత్వం నూతంగా గట్టుప్పల్‌ను మండలంగా ఏర్పాటు చేసినందున మర్రిగూడ మండలం నుంచి రెండు ఎంపీటీసీల స్థానాలను గట్టుప్పల్ మండలంలో చేర్చడంతో మర్రిగూడ మండలం తొమ్మిది ఎంపీటీసీ స్థానాలకు తగ్గింది. ఐతే జిల్లా యంత్రాంగం మర్రిగూడ మండలంకు నూతనంగా సరంపేట గ్రామాన్ని ఎంపీటీసీ స్థానంగా ఏర్పాటు చేయడంతో మండలంలో 10 ఎంపీటీసీల స్థానాలకు చేరింది. ఏది ఏమైనా ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ జోష్

- గత పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో వారిదే హవా
- 60 శాతం పదవులు పొందిన బీసీలు

(ఆంధ్రజ్యోతి-నిడమనూరు)

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లుచేస్తోంది. తొలుత పరిషత్ ఎన్నికలు నిర్వహించడం దాదాపుగా ఖాయమైంది. గ్రామాల్లో రచ్చబండల వద్ద ఎక్కడ చూసినా స్థానిక సంస్థల ఎన్నికల గురించే చర్చ జరుగుతోంది. ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తెచ్చేందుకు ప్రయత్నం చేస్తోంది. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలో గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తాచాటారు. సగానికి పైగా అంటే సుమారు 60 శాతం పదవులు బీసీలే పొందారు. అనేకచోట్ల జనరల్ స్థానాల్లోనూ పోటీ చేసి గెలిచారు. మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా బీసీలకు ఎనిమిది, ఎస్సీలకు ఆరు, ఎస్టీలకు ఒకటి, జనరల్ అభ్యర్థులకు 14 పంచాయతీలు కేటాయించారు. 16 మంది బీసీలు సర్పంచులుగా నెగ్గారు. అదేవిధంగా మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఏడుస్థానాల్లో బీసీలే గెలిచారు. అదే విధంగా ఎంపీపీ పదవి జనరల్ మహిళకు కేటాయించగా బీసీ మహిళ ఎంపీపీ అయ్యారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 22 శాతం కేటాయించగా ఇప్పుడు 42 శాతం కేటాయించనున్నారు. కోటా పెంపుతో స్థానిక సంస్థల్లో ఈసారి బీసీలకు మరింత ప్రాతినిధ్యం పెరుగుతుందని పలువురు భావిసున్నారు. గ్రామాల్లో ఆశావహులు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు.

కానిస్టేబుల్‌పై అట్రాసిటీ కేసు

నల్లగొండ క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చండూరు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఖలీల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఖలీల్ చండూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఖలీల్‌పై అనేక ఆరోపణలు వచ్చాయి. ఇంతకుముందు నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన ఖలీల్ నెల రోజుల క్రితం చండూరుకు బదిలీపై వెళ్లారు. ఖలీల్‌పై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా ఖలీల్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన సస్పెండ్ చేసినట్లు సమాచారం.

పిడుగుపాటుకు ఎద్దు మృతి



విలపిస్తున్న రైతు సత్తయ్య, కుటుంబ సభ్యులు

దేవరకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పద్మట్‌పల్లిలో మంగళవారం రాత్రి పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది. సాయంత్రం వర్షం వస్తుండడంతో రైతు కాటం సత్తయ్య తన ఎద్దును గుడిసె వద్ద కట్టివేసి ఇంటికి చేరుకున్నాడు.రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పడడంతో ఎద్దు మృతి చెందింది. బుధవారం ఉదయం బావి వద్దకు వెళ్లి చూడగా ఎద్దు మృతి చెంది ఉందని, ఎద్దు విలువ రూ.70 వేలు ఉంటుందని,పరిహారం అందజేసి ఆదుకోవాలని సత్తయ్య అధికారులను కోరారు. ఎద్దు మృతితో సత్తయ్యతో పాటు కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

డిండి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : అనుమతులులేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్‌లను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. నల్లగొండ జిల్లా డిండి ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కందుకూరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను చెర్కుపల్లి శివారులో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



రాజు

భువనగిరి టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. పట్టణంలోని తాతానగర్‌కు చెందిన రత్నపురం రాజు(27) ఈ నెల 12న ఇంటి నుంచి మార్కెట్‌కు వెళ్లి తిరిగి రాలేదు. మూడేళ్ల నుంచి మానసిక రుగ్మతతో చికిత్సలు పొందుతున్నాడు. ఈ క్రమంలో ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాకపోవడంతో బంధుమిత్రులు 22 వరకు వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్ 8712662803, ఎస్ఐ 8712576876, ఇన్‌స్పెక్టర్ 8712662471 ఫోన్‌నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు

నల్లగొండ క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా రాత్రి సమయాల్లో దొంగతనాలు చేస్తున్న ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం ఎరసానిగూడేనికి చెందిన ఉబ్బని యోగేశ్వర్, నల్లగొండ పట్టణంలోని బీటీఎస్‌కు చెందిన వల్లూరి యువరాజ్, పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్ మండలానికి చెందిన బాలెం రాజేష్, హైదరాబాద్‌కు చెందిన దస్తర్ బండిషఫీ సంవత్సర నుంచి రాచకొండ, వరంగల్, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తాళం వేసిన ఇళ్లలో రాత్రి సమయాల్లో దొంగతనాలు చేస్తున్నారు. వీరు నల్లగొండలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నారు. వీరి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉందని మంగళవారం సాయంత్రం నల్లగొండ టూటౌన్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడికి నిందితులను అరెస్టు చేసి విచారణ చేశారు. బాలెం రాజేష్, దస్తర్ బండిషఫీ గతంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్, సరూర్‌నగర్, కూకట్‌పల్లి, బంజారాహిల్స్ పరిధిలో ద్విచక్ర వాహనాలు దొంగతనం చేశారు. ఉబ్బని యోగేశ్వర్ తుర్కంజెల్‌లో నివాసం ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బాలెం రాజేష్, దస్తర్ బండిషఫీ అతనికి పరిచయమయ్యారు. వీరు తాగుడుకు, విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి సులువుగా డబ్బులు సంపాదించాలని రాత్రి సమయాల్లో దొంగతనాలు చేసేవారు. యోగేశ్వర్ తన స్నేహితుడైన వల్లూరి యువరాజ్ చంద్ర, సాయికుమార్, శ్రీకాంత్‌లకు ఈ విషయం చెప్పారు. రాజేష్, దస్తర్ బండిషఫీలు, మనోజ్ ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాలతో పాటు తాళం వేసిన ఇళ్లలో దొంగతనం చేసేవారు. నిందితుల నుంచి రూ.25లక్షలు విలువ చేసే 20 తులాల బంగారు అభరణాలు, 1.800కిలోల వెండి అభరణాలు, వెండి చెంబు, పళ్లెం, ద్విచక్ర వాహనం, రెండు ల్యాప్‌టాప్‌లు, నాలుగు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలో సభ్యుడు తలారి మనోజ్ గంజాయి కేసులో ప్రస్తుతం జైలులో ఉన్నాడు. మరో ఇద్దరు నిందితులు సాయికుమార్, శ్రీకాంత్‌లు పరారీలో ఉన్నారు. నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి పర్యవేక్షణలో నల్లగొండ టూటౌన్ సీఐ రాఘవరావు ఆధ్వర్యంలో కేసు ఛేదించిన టూటౌన్ ఎస్ఐ సైదులు, రూరల్ ఎస్ఐ సైదాబాబు, హెడ్ కానిస్టేబుల్ పాయిలి రాజ్, కానిస్టేబుల్ లావురి బాలకోటి, శంకర్, జానకిరాం, ఎంఎ పరూఖ్‌లను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.



నల్లగొండ జిల్లా కేంద్రంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్ చంద్రపవార్, దొంగల నుంచి రికవరి చేసిన బంగారు, వెండి ఆభరణాలు

దేవాలయ భూముల్లో రోడ్డు పనులేంటి?

చిట్యాల రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : దేవాలయ భూముల్లో ప్రైవేట్ వెంచర్ కోసం రోడ్డు ఎలా నిర్మిస్తారని నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామస్థులు పనులను అడ్డుకున్నారు. బుధవారం గ్రామశివారులో శ్రీతిరుమలనాథస్వామి దేవాలయానికి సంబంధించిన భూముల నుంచి ప్రైవేటు వ్యక్తులు చేయిస్తున్న రోడ్డు పనులను గ్రామస్థులు అడ్డుకున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం కొమ్మాయిగూడెం పరిధిలో రసాయన పరిశ్రమ, ప్రైవేటు వెంచర్‌ను ఏర్పాటుచేస్తున్న నిర్వాహకులు తిరుమలనాథస్వామి ఆలయానికి సంబంధించిన భూముల నుంచి రోడ్డు ఏర్పాటుచేసేందుకు పనులు చేపడుతున్నారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు పలువురు అక్కడకు చేరుకుని పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్నారు. రహదారి పనులపై కలెక్టర్‌కు, రెవెన్యూ అధికారులు, దేవాదాయధర్మాదాయశాఖకు పలుమార్లు వినతిపత్రాన్ని అందజేశామని, ఆలయ భూముల్లో కట్టడాలు చేయకూడదని ఆదేశాలు జారీచేశారని గుర్తుచేశారు. దేవాలయ భూముల్లో పనులు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ భూములున్న గుట్ట చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలన్నారు. భూములు ఆక్రమించకుండా, పనులు చేపట్టకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని కలెక్టర్‌ను, అధికారులను కోరారు. కార్యక్రమంలో పొట్లపల్లి చిన్నస్వామిగౌడ్, పొట్లపల్లి చినలింగయ్య, పొట్లపల్లి వేణు, ఏర్పుల దామోదర్, ఏర్పుల రాకేష్, మాచర్ల యాదగిరి, పొట్లపల్లి స్వామి, నందిపాటి శ్రీకాంత్, ఏర్పుల అశోక్, గుండెబోయిన నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను అడ్డుకుంటున్న గ్రామస్థులు

నందికొండ మునిసిపల్ కమిషనర్‌కు హెచ్‌ఆర్‌సీ నోటీసులు

- గతేడాది తాగునీటి ట్యాంకులో కోతులు పడిన ఘటనపై

నాగార్జునసాగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో విజయ విహార్‌లోని తాగునీటి ట్యాంకులో 30కోతులు చనిపోయిన సంఘటనపై నందికొండ మునిసిపల్ కమిషనర్‌కు హెచ్‌ఆర్‌సీ నోటీసులు జారీ చేసింది. గతేడాది ఏప్రిల్ 2వ తేదీన ఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో స్పందించిన ఎన్ఎస్పీ, మునిసిపల్ అధికారులు కోతుల కళేబరాలను నీటిట్యాంకులోంచి తీయించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అధికార, ప్రతిపక్ష నాయకులు, మానవహక్కుల సంఘం అధికారులు నీటి ట్యాంకును పరిశీలించారు. ప్రభుత్వం స్పందించి నీటిట్యాంక్‌ను కూల్చివేసి నివాస గృహాలకు పైప్‌లైన్ ద్వారా నేరుగా నీటిని సరఫరా చేయించింది. ఈ ఘటనపై సమాచార హక్కుల సంఘం ప్రజావేగు అధ్యక్షుడు కన్నెకంటి క్రాంతికుమార్ రాష్ట్ర మానవ హక్కుల సంఘంలో ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన సంఘం నందికొండ మునిసిపల్ కమిషనర్‌కు ఈ ఘటనపై ఆగస్టు 4వ తేదీలోగా నివేదికలు అందజేయాలని నోటీసులు జారీ చేశారు.

ఈ నోటీసులను జిల్లా కలెక్టర్ ద్వారా బుధవారం నందికొండ మునిసిపల్ కమిషనర్ అందుకున్నారు. నివేదికను మానవ హక్కుల సంఘానికి అందజేస్తానని కమిషనర్ గురులింగం తెలిపారు.



మంచినీటి ట్యాంక్ నుంచి కోతుల కళేబరాలను తీస్తున్న సిబ్బంది(ఫైల్‌ఫోటో)

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కట్టంగూరు / మర్రిగూడ/ చండూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉపాధ్యాయ రంగంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నల్లగొండ జిల్లా కట్టంగూరు, మర్రిగూడ, చండూరు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేయాలని, జీవో నెంబర్ 25ను సవరించి ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 40 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. కట్టంగూరులో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకులు, టీఎస్‌యూటీఎఫ్ ఆడిట్ కమిటీ కన్వీనర్ మురళయ్య, మర్రిగూడలో డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పాక నాగేంద్రమ్మ, మండల ప్రధాన కార్యదర్శి పున్న కృష్ణయ్య, మండల నాయకులు రాజీయుద్దిన్, వెంకటయ్య, శ్రీనివాస్, సుమలత, చండూరులో యూఎస్పీసీ జిల్లా నాయకులు చిక్కుళ్ళ రామలింగయ్య, నాంపల్లి సైదులు, బొమ్మరబోయిన సైదులు, సతీష్, శ్రీనివాస్, నర్సింహాచారి, యాదగిరి పాల్గొన్నారు.



కట్టంగూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

విద్యుదాఘాతంతో రైతు మృతి



మోటార్‌పైనే ఒరిగి మృతి చెందిన శ్రీను

నేరేడుచర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె గ్రామానికి చెందిన నగరి శ్రీను(57) గ్రామ శివారులో తనకున్న 23గుంతల భూమిలో సాగు చేస్తున్నాడు. బుధవారం ఉదయం నారుమడికి యూరియా చల్లి నీరు పెట్టేందుకు పొలం పక్కనే వున్న వాగుపై అమర్చిన మోటార్‌ను ఆన్ చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతంతో మోటార్‌పై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సహచర రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. శ్రీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



షేక్‌షకీల్ అహ్మద్ (ఫైల్)

నార్కట్‌పల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమ్మనబోలు గ్రామానికి చెందిన షేక్ షకీల్‌అహ్మద్(29) అమ్మనబోలు గ్రామపంచాయతీలో కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నూతన ఇంటి నిర్మాణం కోసం ఓ ఫైనాన్స్ సంస్థలో రూ.12లక్షల అప్పు చేశాడు. వాటిని తీర్చే మార్గం కరువై అప్పుల బాధతో మనస్థాపం చెందాడు. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. అతడి భార్య షేక్ నబియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు. షకీల్ అహ్మద్‌కు భార్యతో పాటు బాబు ఉన్నాడు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

చింతలపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ సందీప్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ మండలం చిలుకూరు గ్రామానికి చెందిన కందుకూరి కోటేష్ సుతారి పనిచేస్తుంటాడు. రోజు మాదిరే పనికి రేవూరు నుంచి దొండపాడుకు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. గంగమ్మగుడి వద్ద జగ్గయ్యపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతడు నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కోటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోటేష్ బావ అరిగెల మోష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

దాడి కేసులో ఐదేళ్లు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా

మోత్కూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు గ్రామంలో రైతు అంజయ్యపై గొడ్డలితో దాడి చేసి గాయపర్చిన కేసులో రైతు జానయ్యకు రామన్నపేట సివిల్‌కోర్టు జడ్జి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పినట్లు మోత్కూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వరుసకు అన్నదమ్ములైన కాసర్ల అంజయ్య, కాసర్ల జానయ్య మధ్య వ్యవసాయ భూముల వద్ద గెట్టు తగాదా ఏర్పడింది. ఆ తగాదా నేపథ్యంలో 2020 ఏప్రిల్‌లో కాసర్ల జానయ్య దారికాచి అంజయ్యపై గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. తనపై హత్యాయత్నం చేశాడని అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ హరిప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. రామన్నపేట సివిల్ కోర్టులో విచారణ జరిగింది. సాక్ష్యాలు, న్యాయవాదుల వాదనల అనంతరం కాసర్ల జానయ్యకు సివిల్‌కోర్టు జడ్జి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారని ఆయన చెప్పారు. జానయ్యను నల్లగొండ జైలుకు పంపినట్లు ఆయన చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌కేసులో...

సూర్యాపేట క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన వారిలో ఒకరికి జైలు శిక్ష, ముగ్గురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీన సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించామన్నారు. మోతాదుకు మించి నలుగురు మద్యం తాగినట్లు తెలిపారు. వారిని బుధవారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి ఒక రోజు జైలుశిక్షతో పాటు రూ.10000 జరిమానా, మిగిలిన ముగ్గురికి కలిపి రూ.3500 జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని స్పష్టం చేశారు. వాహనాలు నడిపే వారు విధిగా నిబంధనలు పాటించాలన్నారు.

అన్నిరంగాల్లో వెనకబడిన బీసీలు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు

మోత్కూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 65 శాతానికి పైగా ఉన్న బీసీలు అన్నిరంగాల్లో వెనుకబడిపోయారని మన ఆలోచన సాధన సమితి (మాస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కటికం నర్సింగరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు చైతన్యవంతులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీల చేత జెండాలు మోయించుకుంటున్నాయే తప్ప రాజకీయంగా ఎదగనివ్వడం లేదన్నారు. మాస్ బీసీల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తుందన్నారు. మండల నాయకుడు లింగంపల్లి రఘువర్ధన్‌రావు, మోత్కూరి బ్రహ్మ ఆచార్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చుక్క సత్యనారాయణ, గుణగంటి చంద్రశేఖర్, కలిమెల నర్సయ్య, బొడ్డుపల్లి మైసయ్య, మహ్మద్‌రఫీ, సోమయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

చిరుజల్లు కురిసె..


భువనగిరిలో కురుస్తున్న వర్షం



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. కొన్ని చోట్ల ముసురుతో కూడిన వానలు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. నల్లగొండ, యాదాద్రిభువనగిరి జిల్లాల్లో వర్షాలు కురవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇన్నాళ్లూ వరుణుడి కరుణకోసం ఎదురు చూసిన రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. తేలికపాటి వర్షాలు మొక్కలకు జీవం పోశాయి.


నల్లగొండ శివారులో మేఘావృతమైన ఆకాశం


నల్లగొండలో గొడుగులు విక్రయిస్తున్న మహిళ




భువనగిరిలో కురుస్తున్న వర్షం


నల్లగొండలో గొడుగు సహాయంతో..


భువనగిరిలో..

శ్రావణం.. శుభప్రదం

● నెలరోజులు ఆధ్యాత్మిక శోభ ● దేవాలయాల్లో కోలాహలం



నల్లగొండ కల్చరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): అష్టైశ్వర్యాలు ప్రసాదించే మహాలక్ష్మీదేవి శ్రావణ నక్షత్రంలో జన్మించిన మహావిష్ణువును భక్తిశ్రద్ధలతో కొలిచే మాసం శ్రావణం. శ్రావణం పండుగల మాసం. భక్తులకు శుభాలనిచ్చేది. వర్ష రుతువుతో పరిసరాలు పచ్చగా కళకళలాడే కాలం. విశ్వావసు నామ సంవత్సరంలో ఈ నెల 25వ తేదీ నుంచి శ్రావణ మాసం ప్రారంభమై ఆగస్టు 23వ తేదీ వరకు ముగుస్తుంది. శ్రావణ మాసం, హిందూ సంస్కృతిలో ఆధ్యాత్మికత, భక్తి, ఆచారాలకు ప్రతీకగా నిలుస్తుంది. మహావిష్ణువుకు, శివుడికి, లక్ష్మీదేవికి ఎంతో ప్రీతికరమైన మాసం. ఈ మాసంలో మహిళా భక్తులు ఉపవాసాలు, వ్రతాలు, పూజలతో నిమగ్నమవుతారు. ముఖ్యంగా సోమవారాలు శివుడికి, మంగళవారాలు పార్వతికి, అలాగే వరలక్ష్మీవ్రతం చేస్తారు. శుక్రవారాలు సామూహిక కుంకుమ పూజలు చేస్తారు. శ్రావణ మాసంలో హిందువులు వ్రతాలకు, పూజలకు ప్రాధాన్యం ఇస్తారు. శ్రావణ మాసంలో మహిళల హడావిడి ఉంటుంది. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడైన విష్ణుమూర్తి జన్మ నక్షత్రం శ్రావణం అనే పేరుతో శ్రావణ మాసం ఉద్భవించిందని పూరాణాలు చెబుతున్నాయి. అందుకే విష్ణుమూర్తి భార్య లక్ష్మీదేవికి శ్రావణ మాసం అంటే ఎంతో ఇష్టమని పండితులు అంటున్నారు. మొదటి 15 రోజుల్లో వరలక్ష్మీ వ్రతం, నాగపంచమి, రాఖీపౌర్ణమి వస్తే, పౌర్ణమి తర్వాత వచ్చే పాడ్యమి నుంచి అమావాస్య వరకు ప్రత్యేక రోజులు ఉంటాయని పండితులు చెబుతున్నారు.

శ్రావణ పండుగలు ఇలా..

ఈనెల 25న మొదటి శ్రావణ శుక్రవారం, 29న మొదటి శ్రావణ మంగళవారం, ఆగస్టు 1న రెండో శ్రావణ శుక్రవారం, 3న ఫ్రెండ్ షిప్‌డే, 5న శ్రావణ మంగళవారం, 8న మూడో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీవ్రతం, మంగళగౌరి వ్రతం, 9న జంధ్యాల పౌర్ణమి రాఖీ పండుగ, 12న మూడో శ్రావణ శుక్రవారం, 15న నాలుగో శ్రావణ శుక్రవారం, 16న కృష్ణాష్టమి, 19న నాలుగో శ్రావణ మంగళవారం, 22న శనివారం పొలాల అమావాస్యతో శ్రావణ మాసం ఆఖరి రోజు పూలు, ఆగస్టు 24వ తేదీ నుంచి బాధ్రపదమాసం మొదలవుతుంది.

శ్రావణ మాసంలో పాటించే పద్ధతులు

నెలరోజులు ఉపవాస దీక్షలు చేయాలి. శ్రావణ మాసం జ్ఞానోదయం పొందడానికి సహాయపడే అనే నమ్మకాలు, ఆచారాలతో నిండి ఉంటుంది. సాత్వికాహారం తీసుకోవాలి. నిత్యం తల స్నానాన్ని ఆచరించాలి. మాంసాహారం తీసుకోవద్దు. వెల్లుల్లి, ఉల్లిపాయలు వాడకూడదు. పురాణాలు చదవడం, శ్లోకాలను పఠించడం. ఇష్టదైవాలను భక్తిశ్రద్ధలతో పూజించాలి.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

నల్లగొండ(కలెక్టరేట్), జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని భారతీయ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. ఎకరానికి రూ.15వేలు ఇస్తామని, పదిరకాల వ్యవసాయ ఉత్పత్తులకు క్వింటాకు రూ.500లు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరపై బోనస్ ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని అన్నారు. పది రకాల పంటలకు వరిధాన్యం, మొక్కజొన్న, కందులు, సోయాబీన్స్, పత్తి, మిర్చి, పసుపు, ఎర్రజొన్న, చెరుకుకు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమాను అమలు చేయాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, బీజేపీ నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి అశోక్‌రెడి, పిల్లి రామరాజుయాదవ్, నూకల వెంకటనారాయణరెడ్డి, భవనం మధుసూదన్‌రెడ్డి, వెంకటరెడ్డి, బండారు ప్రసాద్, మిర్యాల వెంకటేశం, గడ్డం మహేష్, పోతపాక లింగస్వామి, గుండ కండ్ల సాయన్న, బీపంగి జగ్జీవన్, కట్ట వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

మిగులు భూములు పేదలకు పంచాలి

బీబీనగర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): భూమిలేని పేదలకు మిగులు భూములు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. నాగయ్య డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్‌లో బుధవారం జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. గత పాలకులు పదేళ్లుగా మాయమాటలు చెప్పి కాలయాపన చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములను పేదలకు పంచడంలో ఎందుకు జాప్యం చేస్తోందని ప్రశ్నించారు. రాష్ట్రంలో లక్ష మందికి పైగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వారందరికీ 120గజాల స్థలంఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జాతీయ కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, పద్మ, నారి అయిలయ్య, వెంకటేశ్వర్‌రావు, యాదగిరి, కొండమడుగు నర్సింహ, మాటూరి బాలరాజుగౌడ్, కోమటిరెడ్డి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

41 రోజుల్లో రూ.2.45 కోట్ల హుండీ ఆదాయం

యాదగిరిగుట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఖజానాకు 41రోజుల్లో రూ.2.45కోట్ల హుండీ ఆదాయం సమకూరింది. జూన్ 12నుంచి ఈ నెల 22 వరకు దర్శించుకున్న భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. రూ.2,45,48, 023 నగదుతోపాటు, 38గ్రాముల మిశ్రమ బంగారం, 2.800 కిలోల మిశ్రమ వెండి సమకూరింది.

విదేశీ కరెన్సీ	
అమెరికా	డాలర్లు 1,036
ఆస్ట్రేలియా	డాలర్లు 5
ఇంగ్లాండ్	పౌండ్లు 45
సౌదీ అరేబియా	రియల్ 5
సింగపూర్	డాలర్లు 10
కతార్	రియల్ 1/2
ఓమన్	బైస 500
అరబ్ ఎమిరేట్స్	ధీరమ్స్ 70
శ్రీలంక	రూపీ 500
మలేసియా	రింగిట్లు 23
కెనడా	డాలర్లు 20
బెహ్రెన్	దినార్స్ 2

శాస్త్రోక్తంగా నిత్యపూజలు


నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.9,40,122 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. స్వామివారిని సినీనటుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు మురళీమోహన్ దర్శించుకున్నారు.


పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

దూరవిద్యలో ప్రవేశాలు

నల్లగొండ టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, పీజీ, డిప్లొమోలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. రాంరెడ్డి, సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ వెల్దండి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ తెలుగు, సంస్కృతం, ఇంగ్లీష్, ఫిలాసఫీ, సోషియాలజీ, ప్రభుత్వ పాలనాశాస్త్రం, అర్థశాస్త్రం, చరిత్ర, రాజనీతి శాస్త్రం, సైకాలజీ, ఎంకాం, ఎమ్మెస్సీ గణిత శాస్త్రం, స్టాటిస్టిక్స్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 30 కాంబినేషన్లలో డిగ్రీ కోర్సులు, తొమ్మిది రకాల డిప్లమా కోర్సులు, యోగాలో సర్టిఫికేట్ కోర్సులు ఉన్నాయని తెలిపారు.

సాగర్ కుడి కాల్వకు సాగు నీటి విడుదల


కుడి కాల్వకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని కుడి కాల్వ ఆయకట్టుకు ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల శాఖ అధికారులు బుధవారం సాయంత్రం నీటిని విడుదల చేశారు. కుడి కాలువ పరిధిలో 11.50లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ కృష్ణమూర్తి తెలిపారు. ఈ నెల 18వ తేదీన తాగు, సాగు నీటి అవసరాలకు 154 టీఎంసీల నీరు కావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నివేదికలు అందజేశామని ఆయన తెలిపారు. దీంతో గంటకు 500 క్యూసెక్కుల నుంచి 3000 క్యూసెక్కులు వరకు పెంచుతూ నీటిని విడుదల చేస్తామని ఎస్ఈ చెప్పారు. కార్యక్రమంలో డీఈ శ్రీకాంత్, ఏఈ లుభారతి, సుధా, అనిత, రమణ తదితరులు పాల్గొన్నారు.

మూసీకి కొనసాగుతున్న వరద

కేతేపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు దిగువనగల మూసీ ప్రాజెక్టు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టు నీటిమట్టం రెండు రోజుల క్రితం వరకూ 641అడుగులుగా ఉంది. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోతో ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 643అడుగులు(3.92టీఎంసీలు)గా నమోదైంది. ఎగువ నుంచి 1799.06 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు 570.24క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడి..


నాగరాజుకు సీపీఆర్ చేస్తున్న మదర్ డెయిరీ డైరెక్టర్ కస్తూరి పాండు

భువనగిరి రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడి గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండల పరిధిలోని గంగసానిపల్లిలో బుధవారం జరిగింది. భువనగిరి పట్టణానికి చెందిన ఎస్. నాగరాజు ద్విచక్ర వాహనంపై యాదగిరిగుట్ట నుంచి భువనగిరికి వస్తుండగా మార్గమధ్యలోని గంగసానిపల్లి వద్ద గుండెపోటుకు గురై కిందపడ్డాడు. అదే మార్గం నుంచి వస్తున్న మదర్ డెయిరీ డైరెక్టర్ కస్తూరి పాండు గమనించి నాగరాజుకు సీపీఆర్ చేసి కాపాడారు. దీంతో అతను ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అనంతరం 108 అంబులెన్స్‌లో భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

మునుగోడును కలెక్టర్ దత్తత తీసుకోవాలి

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


గట్టుప్పల్‌లో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

గట్టుప్పల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గాన్ని దత్తత తీసుకోవాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కలెక్టర్ ఇలా త్రిపాఠికి సూచించారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి లబ్ధిదారులకు బుధవారం రేషన్‌కార్డులు అందజేశారు. కొత్త మండలంగా ఏర్పడ్డ గట్టుప్పల్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు, సరైన రోడ్లు లేవని తెలిపారు. సమయం ఇస్తే మునుగోడు నియోజకవర్గ సమస్యలపై ఒక రోజు చర్చిస్తామని తెలిపారు. గట్టుప్పల్ మండలం కోసం ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కుటుంబానికి రూ.4లక్షల ఆర్థిక సాయం చేశానన్నారు. తన రాజీనామాతో గత ప్రభుత్వం గట్టుప్పల్ మండలం, చండూరు డివిజన్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్. ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ రాములు, ఎంపీడీవో మాధవరెడ్డి, నాయకులు వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, రావుల రమేష్, జగన్నాథం, కర్నాటి శ్రీనివాసు, రావుల పర్వతాలు. తదితరులు పాల్గొన్నారు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తా

మునుగోడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన రేషన్‌కార్డుల పంపిణీ చేశారు. పథకాలు నిజమైన పేదలకే అందాలన్నారు. అర్హులకు అందాల్సిన పథకాలు అనర్హులకు అందడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పులను గుర్తించి చక్కదిద్దాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిబంధనలను సడలించాలని తద్వారా పేదలకు మేలు జరుగనుందని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. నెల్లికంటి సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వాలు సంక్షేమ అభివృద్ధి పథకాలను ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే అమలు చేసేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు సంక్షేమ పథకాలు దక్కాలన్న ఉద్దేశం ఉండటం, ఎమ్మెల్యే కృషి చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాఫ్కాబ్ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, చండూరు ఆర్డీవో శ్రీదేవి, మునుగోడు తహసీల్దార్ ఎన్. నరేష్, ఎంపీడీవో ఎం. విజయ్‌భాస్కర్, చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని సంక్షేమ వసతి గృహాలు, కస్తూర్బాగాంధీ, మహాత్మా జ్యోతిబా పూలే బాలికల, బాలుర గురుకుల విద్యాలయాలపై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ముంపు గ్రామాల ప్రజల త్యాగాలు మరువరానివి

మర్రిగూడ: రిజర్వాయర్ నిర్మాణం కోసం నిర్వాసితులు చేసిన త్యాగాలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కొనియాడారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మండలంలో చేపడుతున్న చర్లగూడెం రిజర్వాయర్ ముంపు గ్రామమైన నర్సిరెడ్డిగూడెం బాధిత భూనిర్వాసితులకు బుధవారం మునుగోడు క్యాంప్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసిడింగ్ పత్రాలు అందజేశారు. మునుగోడు నియోజకవర్గంలో సాగు, తాగునీరు అందించేందుకు మీ భూములు త్యాగం చేశారని ఎమ్మెల్యే అన్నారు.

బీఈడీ, ఎంఈడీ కళాశాలల తనిఖీపూర్తి

నల్లగొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా యూనివర్సిటీ గుర్తింపు కోసం దరఖాస్తు చేసిన బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ కళాశాలలను ఈ నెల 19నుంచి 23వ తేదీ వరకు తనిఖీ చేసినట్లు అకాడమిక్ అడిషనల్ డైరెక్టర్ వై. ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ యూజీడీ సీడీ కళాశాలలను ఎడ్యుకేషన్ డిపార్మెంట్ సీనియర్ ప్రొఫెసర్, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌తో కలిసి తనిఖీ చేసినట్లు తెలిపారు.

బహుదూరపు బాటసారులు



వర్షాలు కురుస్తున్న వేళ.. మూసీ పరివాహకమైన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలో బాతులు సందడి చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం వరి కోతలు పూర్తవ్వగానే ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, గుంటూరు తదితర జిల్లాల నుంచి కొందరు బాతు పిల్లలను తీసుకొని భూదాన్ పోచంపల్లి మండలానికి వస్తుంటారు. మండల పరిధిలోని భీమనపల్లి రోడ్డు వెంట బాతుల సమూహం సందడి చేస్తూ కనిపించింది.

● భూదాన్‌పోచంపల్లి, ఆంధ్రజ్యోతి

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మద్దిరాల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన ఆకారపు ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో రూ.11,500 ఆర్థికసాయాన్ని ఎల్లమ్మ కుటుంబ సభ్యులకు ఆ గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు తీకుళ్ల సుధాకర్‌రెడ్డి బుధవార అందజేశారు. ఈ కార్యక్రమంలోవాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కొమ్ము వెంకన్న, అంజయ్య, రంగు జగన్, అజయ్, రామచంద్రు, వెంకటయ్య, మామిడి వెంకన్న, శ్రీను, దేవలింగం పాల్గొన్నారు.

అలుగు వద్ద కంప చెట్ల తొలగింపు

ఆత్మకూర్(ఎస్), జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దుబ్బగూడెం ఆవాస గ్రామంలో బియ్యంకుంట చెరువు అలుగు కాల్వ పూడికను తహసీల్దార్ అమీ న్‌సింగ్ బుధవారం పూడిక తీయించారు. అలుగు వద్ద కంపచెట్లు, పిచ్చి మొక్కలు, చెత్త చెదారంతో నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోందని, దోమలకు నిలయంగా మారిందని స్థానికుల ఫిర్యాదు మేరకు ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

విద్యారంగంలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరిం చాలని కోరుతూ బుధవారం జిల్లా వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిని విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యారంగంలో సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

● కోదాడ టౌన్, అర్వపల్లి, నూతనకల్, నేరేడుచర్ల, ఆత్మకూర్(ఎస్)

రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దరావత్ రవి అన్నారు. బుధవారం కోదాడలో నిర్వహించిన విద్యా సంస్థల బంద్‌లో పాల్గొని మాట్లాడారు. ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, గుర్తింపు లేని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేయాలని, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలు రూ.8 కోట్లను విడుదల చేయాలని విద్యాశాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాఖీ, విష్ణు, వికాస్, మాదాస్ చరణ్, అజయ్, బి.చందుకుమార్, ఉమేష్, వికాస్, సంధ్య స్వరూప పాల్గొన్నారు.



అర్వపల్లిలో బంద్‌లో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థినులు

● విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు అర్వపల్లి మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను స్వచ్ఛందంగా బంద్ చేయించారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, రవి, వెంకన్న, భాస్కర్ పాల్గొన్నారు.

● నూతనకల్ మండల కేంద్రంతో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బంద్ విజయవంతమైంది.. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు పిడమర్తి భరత్, మణి ఎమాట్లాడుతూ విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివ, బన్నీ పాల్గొన్నారు.



కోదాడలో బంద్‌లో పాల్గొన్న ఏఐవైఎఫ్, పీవైఎల్, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు

● నేరేడుచర్లలో పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో విద్యాసంస్థలను మూసివేయించారు. కార్యక్రమంలో చిలకరాజు శ్రీను, వెంకట్, వాస కరుణాకర్, ఉబ్బపల్లి సైదులు, షేక్ నాగులు, మాతంగి విజయ్, షేక్ సయ్యద్, హుస్సేన్‌పాల్గొన్నారు.

● ఆత్మకూర్(ఎస్)లో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ కార్యక్రమంలో సానబోయిన ఉపేందర్, కేశబోయిన వంశీ, చిత్తలూరి ఉదయ్‌కుమార్, వరికుప్పల మహేష్, నల్లగొండ నాగయ్య, వేణు, అఖిల్, నవీన్, పవన్, మల్లేష్, సాయి,పాల్గొన్నారు.

ఐదు గ్రామాలకు ప్రత్యేక విద్యుత్ లైన్లు ఏర్పాటుచేయాలి

హుజూర్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐదు గ్రామాలకు ప్రత్యేక విద్యుత్ లైన్లు ఏర్పాటుచేయాలని మర్రిగూడెం గ్రామస్థులు అజ్మతుల్లా, వీరస్వామి, వేణుగోపాల్ కోరారు. బుధవారం పట్టణంలోని విద్యుత్ డీఈ వెంకటకృష్ణయ్యకు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూరుగడ్డ, మాచవరం, కరక్కాయలగూడెం, మర్రిగూడెం, గోపాలపురం గ్రామాలకు సంబంధించి రైతుల వ్యవసాయ విద్యుత్ మోటార్లకు, ఇళ్లకుసంబంధించి ఒకే లైన్ ఏర్పాటు చేసినందున లోవోల్టేజీ సమస్యతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. లోవోల్టేజి సమస్యను పరిష్కరించడంతో పాటు హుజూర్‌నగర్ సబ్‌స్టేషన్ నుంచి మాధవరాయనిగూడెం మీదుగా సింగిల్ ఫేజ్ కరెంట్ ఏర్పాటుచేసి ఆయా గ్రామాల పరిధిలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడియం వీరస్వామి, అల్లాబిక్షు, గుళ్ల శ్రీనివాసు, ఆదెయ్య, మల్లేష్, వాసవి, మోయినొద్దీన్ పాల్గొన్నారు.

సమాచారం

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నేరేడుచర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నేరేడుచర్ల మునిసిపాలిటీ పరిధిలోని 19 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సురిగి సైదులు సమక్షంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నూకల సందీప్‌రెడ్డి, కొణతం చినవెంకటరెడ్డి, బచ్చలకూరి ప్రకాష్, పేరబోయిన వీరయ్య, మచ్చ శ్రీను, ఆకారపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు బుక్స్ అందజేత

నేరేడుచర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులగంబండ తండా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్సిల్స్ బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గున్‌రెడ్డి సైదిరెడ్డి, విశ్వనాథం, సూరిబాబు, ఆదిరెడ్డి పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్, ఉపాధ్యాయుడు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో మొక్కలు నాటాలి

నూతనకల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి):హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ఇంటికో మొక్కను విధిగా నాటాలని ఎంపీడీవో సునీత కోరారు. బుధవారం మండలంలోని ఎర్రపహాడ్ గ్రామ శివారులో 365 జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆమె వెంట ఎంపీవో శశికళ, ఏపీవో శ్రీరాములు, పంచాయితీ కార్యదర్శి సత్యవతి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

హుజూర్‌నగర్, కోదాడ రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చింతలపూడి ఉమామహేశ్వరరావు, ఎన్నికల ఇన్‌చార్జి చిత్తలూరి సోమయ్య అన్నారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో మండల ఎన్నికల ఇన్‌చార్జి దేనమకొండ రామరాజు, కోటిరెడ్డి, లక్ష్మీనారాయణ, బిక్షమయ్య పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆ పార్టీ జడ్పీటీసీ ఎన్నికల కోదాడ మండల ప్రభారీ నూనె సులోచన, ఇన్‌చార్జి యరగాని రాధాకృష్ణ, ఎంపీటీసీ ఎన్నికల ఇన్‌చార్జి ఓరుగంటి కిట్టు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాన్ని బుధవారం కోదాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ సమావేశంలో జాబిశెట్టి పూర్ణయ్య, కళావతి, బాలరాజు, రెడ్డిబోయిన జ్ఞానేందర్, శెట్టి కిరణ్‌కుమార్, దాసన్న, దేవరశెట్టి సత్యనారాయణ, వెంకన్న, భూమా శ్రీనివాస్, చెవిరెడ్డి, పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చింతలపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉచిత పశు వైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికఅరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ అన్నారు. హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని స్థూపం బజార్‌లో పశువైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలోనందిరెడ్డి, ఇంద్రారెడ్డి, సంతోష్, నవీన్, బత్తుల సైదిరెడ్డి, పశువుల వైద్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మధు, గోపాల్,మిత్ర సిబ్బంది, చారి, రమాకాంత్ పాల్గొన్నారు.

ఎంపీ చామల పుట్టినరోజు వేడుకలు

నూతనకల్, మద్దిరాల, నాగారం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను బుధవారం నూతనకల్, మద్దిరాల, నాగారం మండలాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నూతనకల్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, కట్ట మల్లారెడ్డి, పసుల అశోక్‌యాదవ్,కృష్ణనాయక్, మద్దిరాల మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లుయాదవ్, తాళ్లపల్లి సురేష్, పులిగిళ్ల లింగయ్య, యూత్ కాంగ్రెస్ నాగారం మండల అధ్యక్షుడు షేక్ వలి, పానుగంటి నర్సింహారెడ్డి, నాతి వీరమల్లు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సూర్యాపేట టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా శిక్షకుడు పాపిరెడ్డి, ఫిజియోథెరపీ డాక్టర్ సతీష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన యోగా వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో యోగాకు చాలా ప్రాముఖ్యం ఉందన్నారు. శారీరక, మానసిక రుగ్మతలు, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, బీపీ, షుగరు వంటి అనేక దీర్ఘకాలిక రోగాలకు అధిగమించడానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వేల్పుల సుధాకర్, నల్లెడసుదర్శన్‌రెడ్డి, భాస్కరచారి, వల్కి లింగయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

అనంతగిరి, హుజూర్‌నగర్ రూరల్, చిలుకూరు, నాగారం, ఆత్మకూర్(ఎస్) జూలై 23(ఆంధ్రజ్యోతి):ఈ పంచాయతీ, ఆర్‌జీఎస్‌ఏ కంప్యూటర్ ఆపరేటర్లకు పెండింగ్ ఉన్న వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని జిల్లా అధ్యక్షుడు బాణోత్ ప్రసాద్ కోరారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలో ఎంపీడీవో లావణ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు సకాలంలో అందజేయనందుకు నిరసనగా బుధవారం నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఆర్‌సీ పాలసీని అమలుచేయాలన్నారు. ఈకార్యక్రమంలో సాయిలక్ష్మి,గోపీసాయినాథ్ పాల్గొన్నారు.

● పెండింగ్ వేతనాలు చెల్లించాలని అనంతగిరి మండల ఈ పంచాయతీ, ఆర్‌జీఎస్‌ఏ ఆపరేటర్లు కోరారు.

● చిలుకూరు, మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు విధులు బహిష్కరించారు. అనంతరం ఎంపీడీవో గిరిబాబు, ఎంపీవో ముక్కపాటి నర్సింహారావు, సూపరింటెండెంట్ ప్రతాప్‌సింగ్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సందీప్, శేషు, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

● మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఈ పంచాయతీ ఆపరేటర్లకు పేస్కేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని నాగారం ఈ పంచాయతీ ఆపరేటర్ చింతల సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు నాగారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కె.మారయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతల సురేష్, గుంటకండ్ల రాధిక తదితరులు పాల్గొన్నారు.

● పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ పలువురు కంప్యూటర్ ఆపరేటర్లు ఎంపీడీవో హసీంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్లు బిక్షం, విజయ్‌కుమార్, ఆనంద్, జ్యోతి, గౌతమ్ పాల్గొన్నారు.



అనంతగిరిలో ఎంపీవోకు వినతిపత్రం అందజేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నాగారం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్ధమానుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం హైదరాబాద్‌లోని ఓ ఫాంహౌస్‌లో సమ్మేళనం నిర్వహించారు. 36ఏళ్ల తర్వాత కలుసుకున్న బాల్య స్నేహితులు ఆప్యాయంగా పలకరించుకుని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు దొంతిరెడ్డి కృష్ణారెడ్డి, కోట అశోక్, కోమటి సత్యనారాయణ, సైరెడ్డి కృష్ణారెడ్డి, సోమ వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, రంగయ్య, ఆంజనేయులు, దాసరి కృష్ణయ్య, ఈదుల రమేష్, రవీంద్రాచారి, రామస్వామి, వెంకన్న, రామలింగయ్య, రాణి, పద్మ, మంజుల, వెంకటమ్మ, శోభరాణి, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణలో మేటి 'ఓస్టా, ఆఫ్‌సెట్'



ఓస్టా కంపెనీ కలుపు మందులను ఆవిష్కరిస్తున్న కంపెనీ ప్రతినిధులు

సూర్యాపేట టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): వరిలో కలుపు నివారణకు 'ఓస్టా, ఆఫ్‌సెట్' మందులు బాగా పనిచేస్తాయని 'ఇండోఫిల్' కంపెనీ డివిజనల్ ఇన్‌చార్జి విద్యాసాగర్ అన్నారు. బుధవారం సూర్యాపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మిర్యాలగూడెం ఇన్‌చార్జి జె.నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వరి నాటిన మూడు రోజుల లోపు ఓస్టా, ఆఫ్ సెట్' లను పిచికారీ చేస్తే కలుపును మొలకెత్తనీయవని అన్నారు. కలుపు మొలిసిన తర్వాత కూడా కాంట్రియే, క్యూలం, మందులు బాగా పనిచేస్తాయన్నారు. ఈ అవగాహన సదస్సులో జోనల్ ఇన్‌చార్జి గురువారెడ్డి,, శ్రీకాంత్, సంతోష్, శ్రీనివాస్‌నాయుడు, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

భూసేకరణకు రైతులు సహకరించాలి

హుజూర్‌నగర్ రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : హుజూర్‌నగర్ ప్రాంతంలోని మగ్దుమ్‌నగర్, యర్రగట్టు ప్రాంతాల్లో వ్యవసాయ యూనివర్సిటీ నిర్మాణానికి రైతులు సహకరించాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు కోరారు. బుధవారం పట్టణంలోని ఇందిరభవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి ఉత్తమ్ ఎంతో కష్టపడి ప్రభుత్వం నుంచి యూనివర్సిటీ మంజూరు చేయించారని తెలిపారు. రైతులు స్వచ్ఛందంగా భూసేకరణకు సహకరించాలన్నారు. యూనివర్సిటీ నిర్మాణంతో రైతులకు కొత్త వంగడాలు, విత్తనాలు లభిస్తాయని, శాస్త్రవేత్తలు విలువైన సలహాలు, సూచనలు అందిస్తారని అన్నారు. సమావేశంలో కారింగుల వెంకటేశ్వర్లు, వీరబాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసు, రాములు, వెంకన్న, జెయిలు, పున్నయ్య, బెంజిమెన్, కోటయ్య పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలి

మద్దిరాల, జూలై 23(ఆంధ్రజ్యోతి): 'ఉపాధి' పనుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులో నమోదు చేయాలని సెంట్రల్ టీం సభ్యుడు షాలిన్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పోలుమళ్ల గ్రామంలో 'ఉపాధి' పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప కూలీలకు సరైన కూలి అందే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు సాల్మన్, ఏపీవో గుండు వెంకన్న, టీఏలు అశోక్, మురళి నాగరాజు, ఈసీ చారి, ఫీల్డ్ అసిస్టెంట్ శోభ, పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు అభినందనీయం



రామరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కృష్ణారావు

కోదాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని కాంగ్రెస్ నాయకుడు రావెళ్ల కృష్ణారావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ట్రాఫిక్ డీసీపీ తేజావత్ రామరాజును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

సూర్యాపేట టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రణతి ఆసుపత్రి మేనేజిమెంట్ డాక్టర్ పెండ్యాల విజయభాస్కర్, వై.రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ పంక్షన్‌హాల్‌లో ప్రణతి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాయామంతో దీర్ఘకాలిక రోగాలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పృథ్వీకల్యాణ్, హేమలత, కేవీపీఎస్ కోట గోపి పాల్గొన్నారు.

మత్స్యకారుల సొసైటీలకు నిధులు విడుదల చేయాలి



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న బాలకృష్ణ

హుజూర్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సొసైటీలకు ప్రభుత్వం నిధులు వెంటనే విడుదల చేయాలని ఆ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం శ్రీను కోరారు. బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మత్స్యకారుల జిల్లా 3వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేప పిల్లల కోసం మత్స్యకారుల సొసైటీ ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమచేయాలన్నారు. చేప పిల్లలు పెంచేందుకు ప్రభుత్వం అన్నివిధాలా సహకరించాలన్నారు. రాష్ట్రంలో ఆక్రమణలకు గురవుతున్న చెరువులను ప్రభుత్వం కాపాడాలన్నారు. చెరువు భూములను సర్వే చేసిచుట్టూ ఫెన్సింగ్ వేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీడీసీ, ఎన్ఎఫ్‌డీబీ నిధులను ఎత్తివేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. మత్స్యకారు లకు ఉపాధి నిమిత్తం హుజూర్‌నగర్‌లో రూ.5 కోట్లతో హోల్‌సేల్ చేపల మార్కెట్ నిర్మించాలన్నారు. రాష్ట్రంలో అన్ని మండలాల్లో ముదిరాజ్‌ల కమ్యూనిటీ హాళ్లకు స్థలం కేటాయించి, నిధులు మంజూరుచేయాలన్నారు. చెరువు స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మహా సభలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి, పోసనబోయిన హుస్సేన్, నాగమణి, బిక్షం, తంగెళ్ల, వెంకటచంద్ర, త్రివేణి, నాగేశ్వరరావు, మల్లయ్య, తిరపయ్య, యశోద, కనకమ్మ, నర్సింహారావు, బాలసైదులు, వెంకటేష్ పాల్గొన్నారు.

కెప్టెన్ లక్ష్మీసెహగల్ ఆశయాలు సాధించాలి

హుజూర్‌నగర్, మునగాల రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కెప్టెన్ లక్ష్మీసెహగల్ ఆశయాలు సాధించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వెంకటచంద్ర కోరారు. లక్ష్మీసెహగల్ 12వ వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని అమరవీరుల భవన్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వామపక్ష భావజాలం కలిగిన లక్ష్మీసెహగల్ రాజకీయంలో, వైద్యరంగంలో ప్రజల తరపున పోరాడార న్నారు.ఈ కార్యక్రమంలో పల్లె వెంకటరెడ్డి, త్రివేణి, బాలకృష్ణ, హుస్సేన్, శీలం శ్రీనుపాల్గొన్నారు.

● మునగాల మండలంలోని జగన్నాథపురం గ్రామంలో బుధవారం కెప్టెన్ లక్ష్మీసెహగల్ 12వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు షేక్ ఖాజాబీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఖాజాబీ మాట్లాడుతూ ఆనాడు సుభాష్ చంద్రబోస్ సహచరిగా, ఆ తరువాత కమ్యూనిస్టు ఉద్యమంలో కడదాక సాగిన వీరవనిత సెహగల్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం మండల కమిటీ సభ్యురాలు వెంపటి మైసమ్మ, గ్రామ మహిళా కమిటీ సభ్యులు బొల్లం శ్రీదేవి, సుభద్ర, దైద జ్యోతి, షేక్ చాందిని, వీరమ్మ, సుల్తాన్‌బీ, రేణుక తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీసెహగల్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వెంకటచంద్ర

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చిలుకూరు, అర్వపల్లి, సూర్యాపేట రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆడిట్ సభ్యుడు జనార్దన్, డీహెచ్‌ఎం గుజ్జుల నర్సింహారెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ ధ్రువకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. . వినతిపత్రం అందజేసిన వారిలో టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కైలాసం వెంకటేశ్వర్లు, వీరస్వామి, చందా శ్రీను, కాసాని సత్యం, ఉపేందర్, వీరబాబు ఉన్నారు.

● నోషనల్ ఇంక్రిమెంట్లు తక్షణమే విడుదల చేయాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు యాదగిరి, నాగరాజు, కోరారు. అర్వపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్, తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయాలన్నారు.

● ప్రభుత్వ విద్యారంగంలో ఎన్‌జీవోల జోక్యాన్ని నివరించాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట స్టీరింగ్ కమిటీ సభ్యులు అన్నారు. సూర్యాపేట తహసీల్దార్ కార్యాలయంలో 30 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాచూరి ప్రతాప్, ఆనంద్, యాదగిరి, శంకర్, నర్సయ్యపాల్గొన్నారు.

గౌరవానికి సూచిక మహాలక్ష్మి పథకం

కోదాడ రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మహిళలపై గౌరవానికి సూచికంగా రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీఐ ఎస్‌కే జిలాని, ఎస్ఐ రాజా అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఎక్కువగా ప్రయాణించే మహిళా ప్రయాణికులను బుధవారం కోదాడ బస్‌స్టేషన్‌లో సన్మానించడంతో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్‌నాగశ్రీ, గ్యారేజ్ ఇన్‌చార్జి రావు, ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ .శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

భానుపురి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమార్కెట్ అభివృద్ధి కోసం డైరెక్టర్లు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉన్నత శ్రేణి కార్యదర్శి ఫసియొద్దిన్(ముక్రం)డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమాజంపై అవగాహన ఉండాలి

మద్దిరాల, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సమాజంపై అవగాహన ఉండాలని తుంగతుర్తి సీఐ నర్సింహారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పోలీస్ ప్రజాభరోసా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐ వీరన్న, ఏఎస్‌వో తేజశ్రీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో యువత భాగస్వాములు కావాలి

మునగాల, మునగాల రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నేరాల నియం త్రణలో యువత భాగస్వాములు కావాలని సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం మునగాలలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

వైభవంగా మాస కల్యాణం

మేళ్లచెర్వు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత స్వయంభు శంభులింగేశ్వర ఆలయంలో బుధవారం స్వామి వారి మాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు కొంకపాక రాధాకృష్ణమూర్తి, యాతావాకిల భానుకిరణ్‌శర్మ, భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి

కోదాడ టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి) ప్రతిఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని మునిసిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు. బుధవారం పట్టణంలో శ్రీనగర్ కాలనీ ప్రైమరీ స్కూల్‌లో స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ట్రస్టు సభ్యులతో కలిసి మొక్కలను నాటి మాట్లాడారు. . కార్యక్ర పైడిమర్రి సత్తిబాబు, ఓరుగంటి కిట్టు, సతీష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నాగారం, జూలై 23(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నాగారం బంగ్లా పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని తహసీల్దార్ హరికిషోర్‌శర్మ, ఎంపీడీవో కె.మారయ్య లు ప్రారంభించారు. కార్యక్రమంలో ముకుందారెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎంపీల జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

చిలుకూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేటలో ఈ నెల 27న నిర్వహిస్తున్న ఆర్ఎంపీల జిల్లా సదస్సును ఆర్ఎంపీలు, విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పొనుగోటి భుజంగరావు, ప్రధాన కార్యదర్శి గునగంటి వెంకన్నలు కోరారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. .

బోధనలో నైపుణ్యం అవసరం

కోదాడ టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనలో నైపుణ్యం అవసరమని కోదాడ ఎంఈవో సలీంషరీఫ్ అన్నారు. బుధవారం పట్టణంలోని బాయ్స్ హైస్కూల్‌లో కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్ల పరిధిలోని 36మంది పాఠశాలల సైన్సు, గణిత ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు.

ఇలా అయితే నిఘా ఎలా?

(5వ పేజీ తరువాయి)

సూర్యాపేట పట్టణంలో ఎటువెపు వెళ్లారు, ఎలా వెళ్లారు అనే విషయాలు స్పష్టంగా తెలుసుకోవడానికి ఎంజీ రోడ్‌లో ఏర్పాటుచేసిన కెమెరాలు పని చేయడంలేదు. వీటితో పాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో ఇటీవల ద్విచక్రవాహనాలు ఎక్కువగా చోరీ అవుతున్నాయి. కెమెరాలు పనిచేయకపోవడంతో నిందితులను గుర్తించడం ఇబ్బందిగా మారింది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్లలో ఏర్పాటు చేసిన కెమెరాలు సైతం సరిగా పనిచేయడం లేదు. బస్టాండ్లలో అనేకమంది ప్రజలు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ సమయాల్లో దొంగలు చోరీలకు పాల్పడుతుంటారు. ఇప్పటికైనా పట్టణంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకుంటే నేరాల నివారణకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండనుంది.

సీసీ కెమెరాలను వినియోగంలోకి తెస్తాం



సూర్యాపేటలో పనిచేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం. ప్రతీ గ్రామం, కాలనీ, టౌన్‌షిపులు, దుకాణాల సముదాయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యం. ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి. సీసీ కెమెరాల ఆవశ్యకతపై పోలీసులు ప్రజలకు వివరించి వారిని భాగస్వాములను చేయాలి.

కొత్తపల్లి నర్సింహ, ఎస్పీ